

మహాకుంభమేళాకు వెళ్లిరండిలా.. 6

- పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ రైళ్లు
- మహాకుంభమేళా వీక్షణకు వచ్చేనెలలో 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట ప్రత్యేక రైలు
- రాజమహేంద్రవరం, సామర్లకోట, తునిలో హాల్టు

# 'కుర్చీ'పై కాక

- రాజకీయ వివాదానికి తెరలేపుతోన్న ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక
- బియ్యం స్మగ్లింగ్ కేసులు ఎదుర్కొంటున్న ఓ నేత పావులు
- సదరు నేతపై పిఠాపురం, గండేపల్లి, రాజమహేంద్రవరం స్టేషన్లలో కేసులు
- ఇప్పటికీ యథేచ్ఛగా రేషన్ బియ్యం వ్యాపారం దందా
- ఇవన్నీ దాచేసి చైర్మన్‌గా నెగ్గేలా జనసేన పార్టీని తప్పుదోవ పట్టిస్తోన్న నేత
- ఇప్పటికే కేసులను దాచేసి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా విజయం
- సదరు నేత తీరుపై జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అత్యంత కీలకమైన ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక వ్యవహారం దుమారం రేపుతోంది. కూటమి పార్టీలకు జెల్లకొట్టి చైర్మన్‌గా నెగ్గేందుకు ఓ నేత చేస్తోన్న ప్రయత్నం కాకరేపుతోంది. తనపై ఉన్న రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులను దాచేసి ఏం ఎరుగనట్టు చైర్మన్ సీటు కోసం పావులు కదపడం జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలకు మంటపుట్టిస్తోంది. ఒకపక్క కాకినాడ కేంద్రంగా సాగుతోన్న రేషన్ మాఫియాపై కూటమి ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం పవన్ పోరాడుతుంటే తనపై బియ్యం స్మగ్లింగ్ కేసులు బయటకు పొక్కనీయకుండా ఏకంగా పవన్‌నే బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుండడం టీడీపీ ఎమ్మెల్యేలతోపాటు జనసేన నేతల్లోను ఆగ్రహం రప్పిస్తోంది. మొత్తం ఆరుగురు సభ్యుల్లో అయిదుగురు టీడీపీ నుంచే ఉన్న నేపథ్యంలో చైర్మన్ పోస్టు టీడీపీ, ఒక సభ్యుడు ఉన్న జనసేనకు వైస్ చైర్మన్ ఇవ్వాలని లెక్కలేసుకుంటున్న తరుణంలో సదరు నేత చేస్తున్న ప్రయత్నాలు రెండు పార్టీల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై టీడీపీ నేతలు టీడీపీ అధిష్ఠానం, పవన్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



### డీసీ ఎన్నికల ఫలితాలు ఇవి..

ఏలేరు ప్రాజెక్టు పరిధిలో 30 నీటి వినియోగదారుల సంఘాలకు తొలుత ఎన్నికలు జరిగాయి. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవులకు ఈనెల 17న ఎన్నికలు నిర్వహించారు. ఈ చైర్మన్ పదవుల్లో అయిదు తెలుగుదేశం పార్టీకి లభించగా, ఒకటి జనసేన పార్టీకి దక్కింది. ఏలేరు డీసీ-1(లింగంపర్తి) చైర్మన్‌గా గణపతి రాజు వెంకట సుబ్బరాజు, డీసీ-2(జగ్గంపేట) నీలం శ్రీనివాస్, డీసీ-3(ముక్కొల్లు)కు బస్వా వీరవెంకట నాగేంద్ర, డీసీ-4 (పెద్దాపురం)కు వేదుళ్ల దొరయ్య రాజశేఖర్, డీసీ-5(పిఠాపురం) సోము సత్యనారాయణ, డీసీ-6(గొల్లప్రోలు) చైర్మన్‌గా ఊటా ఆదివిష్ణు అలియాస్ నానిబాబు ఎన్నికయ్యారు. అయితే ఈ ఆరుగురిలో ఒకరిని ఏలేరు ప్రాజెక్టు చైర్మన్‌గా ఈనెల 21న ఎన్నుకోవాల్సి ఉంది.

### టీడీపీకే చైర్మన్ పదవి రావాలి

సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో టీడీపీ తరఫున ముక్కొలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఉన్న బస్వా వీరవెంకట నాగేంద్రకు ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఇస్తారని విస్తృత ప్రచారం సాగింది. అతని కోసం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తొలి నుంచీ పట్టుదలగా ఉన్నారు. అతడికే ప్రాజెక్టు కమిటీ దక్కుతుందని పార్టీ నేతలు లెక్కలు వేశారు. అటు వైస్‌చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించాలని చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆపార్టీ తరఫున ఉన్న ఏకైక గొల్లప్రోలు డీసీ చైర్మన్ ఊటా నానిబాబుకు ఆ పదవి ఇస్తారని ప్రచారం సాగింది. టీడీపీ, జనసేన వర్గాలు కూడా ఇదే నిర్ణయానికి కట్టుబడి ముందుకు కదిలాయి. అయితే ఇక్కడే అసలు రాజకీయం మొదలవడంతో ఇప్పుడు చైర్మన్ ఎన్నిక వ్యవహారం అనేక మలుపులు తిరుగుతోంది. ప్రధానంగా వైస్ చైర్మన్ రేసులో ఉంటారనుకున్న నానిబాబు ఇప్పుడు తెరవెనుక చక్రం తిప్పుతూ ఏకంగా చైర్మన్ పదవినే దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. టీడీపీకి దక్కాల్సిన చైర్మన్ కుర్చీని లాక్కోవడం కోసం కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు చేస్తోన్న ప్రయత్నాలపై టీడీపీ ఎమ్మెల్యేలంతా గుర్రుగా ఉన్నట్లు సమాచారం. రెండు పార్టీలు సామరస్యంగా పదవుల పంపకంపై కసరత్తు చేస్తే సదరు నానిబాబు ఏకంగా డిప్యూటీ సీఎం పవన్‌కు బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యేలు ఆగ్రహంగా ఉన్నారు.

### అన్నీ బియ్యం స్మగ్లింగ్ కేసులే

ప్రధానంగా నానిబాబు మొదటి నుంచి రేషన్ బియ్యం వ్యాపారం సాగిస్తుంటారని అందులో భాగంగా ఇతడిపై రాజమహేంద్రవరం త్రీటౌన్, గండేపల్లి, పిఠాపురం రూరల్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయినట్లు పలువురు చెబుతున్నారు. ఇప్పటికీ రేషన్ బియ్యం వ్యాపారంలో సదరు నేత కీలకంగా ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఒకపక్క రేషన్ అక్రమార్కులపై పవన్ పోరాడుతుంటే ఏకంగా ఆయనకే బురిడీ కొట్టించి ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ కుర్చీపై కన్నేసి పావులు కదపడం రెండు పార్టీల్లో విస్మయం వ్యక్తమవుతోంది. దీనిపై పవన్‌కు సైతం రెండు పార్టీల నేతలు ఫిర్యాదు చేశారు. అటు టీడీపీ అధిష్ఠానానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు.

### ఎన్నికపై మల్లగుల్లాలు..

ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు ఈనెల 21న ఎన్నికలు జరగనున్నాయి. చైర్మన్ పదవికి ఎన్నిక కావాలంటే మరో డీసీ చైర్మన్ కొత్త చైర్మన్ పేరును ప్రతిపాదించవలసి ఉంటుంది. దీని ప్రకారం జనసేనకు చెందిన ఒక డీసీ చైర్మన్ నానిబాబు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నిక కావడానికి టీడీపీకి చెందిన డీసీ చైర్మన్ ప్రతిపాదించాల్సి ఉంటుంది. తమ ను కాదని ప్రాజెక్టు కమిటీని సదరు రేషన్ బియ్యం వ్యాపారికి ఇస్తే జనసేన అభ్యర్థిని ప్రతిపాదించకూడదని టీడీపీ ఎమ్మెల్యేలంతా దాదాపు నిర్ణయానికి వచ్చారు. మరోపక్క అయిదుగురు సభ్యులు టీడీపీకి ఉండడంతో సదరు బియ్యం వ్యాపారికి చైర్మన్ గిరీ లభిస్తే రెండు పార్టీలకు మచ్చ రానున్న నేపథ్యంలో అయిదుగురిలో ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ పదవి కట్టబెడితే ఎలా ఉంటుందని అంశంపై నాలుగు నియోజకవర్గాల టీడీపీ కీలక నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి.లేదంటే పోలింగ్ రోజు మెట్ట పరిధిలో ఉన్న ముగ్గురు చైర్మన్లు ఎన్నికకు గైర్హాజరైతే మిగిలిన ముగ్గురిలో ఇద్దరు టీడీపీ నుంచి పోలింగ్‌కు హాజరై అందులో ఒకరికి ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మరికొరు ప్రతిపాదిస్తే ఆ డీసీ చైర్మన్ ప్రాజెక్టు చైర్మన్‌గా ఎన్నికవుతారు. ప్రతిపాదించే డీసీ చైర్మన్ లేకపోతే నానిబాబుకు మద్దతు దొరక్క ఒడిపోనున్నారు. ఈ వ్యూహం అమలుకు కూడా ఆలోచన చేస్తున్నారు. మరోపక్క కాకినాడ జిల్లాలో కీలక పదవులన్నీ జనసేనకు దక్కడంపై ఇప్పటికే అసంతృప్తిగా ఉన్న టీడీపీ నేతలకు ఏలేరు ప్రాజెక్టు కమిటీ కూడా పవన్‌కు తెలియకుండా సదరు నేత చేతుల్లోకి వెళ్తే జిల్లాలో చెడ్డపేరు రావడంతో పాటు ప్రత్యర్థి పార్టీతోపాటు ప్రజలు టార్గెట్ అవుతామనే ఆందోళన వెన్నాడుతోంది. ఇప్పటికే ఈ తంతును ఇద్దరు ఎమ్మెల్యేలు నేరుగా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. అటు ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా నానిబాబు కూటమి పార్టీలను కాదని రేసులో నిలబడితే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు సైతం తలనొప్పులు వస్తాయనే ఆలోచనతో ఆయన దృష్టికి కూడా పార్టీ అధిష్ఠానం ద్వారా తీసుకువెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠకు దారితీస్తోంది.

## బీచ్ పార్క్ సందర్శనకు ఏర్పాటు

- కౌడ అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన మొదటి కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కౌడ అధ్యక్షుడు రామస్వామి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెలాఖరుకు కాకినాడ బీచ్‌పార్కు ప్రజల సందర్శనార్థం అందుబాటులోకి తీసుకొస్తామని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) తెలిపారు. ఆయన అధ్యక్షతన బుధవారం మొదటి సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు కమిటీ ఆమోదం తెలిపింది. కాకినాడ జంతు హింసా నివారణ సంఘంలో మౌలిక సదుపాయాల కల్పనకు, కాకినాడ బీచ్‌కు మరింత మెరుగులు దిద్దుటకు, ప్రజలకు పిల్లలకు ఆహ్లాదం కల్పించేందుకు కాకినాడ బీచ్ పార్కులో మరి కొన్ని నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. ప్రతిష్టాత్మకమైన టీయూ 142ఎం యుద్ధ విమాన ప్రదర్శనకు ఎంట్రీ టికెట్ ధర నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కౌడ వైస్ చైర్‌పర్సన్ భావన, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వర్గీకరణ వద్దు : కాకినాడలో మాలల నిరసన ప్రదర్శన



వర్గీకరణ ముద్దు : మాదిగ ఉపకులాల నినాదాలు

# వర్గీకరణం

- ఎస్సీ వర్గీకరణపై ఉపకులాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ
- కాకినాడ విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- వర్గీకరణకు అనుకూలంగా.. వ్యతిరేకంగా మోహరించిన ఇరువర్గాలు

## 2468 మంది హాజరు.. 311 వినతులు

7

కాకినాడలో ప్రజాభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లా నుంచి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ గురువారం కాకినాడలో ప్రజాభిప్రాయసేకరణ చేశారు.దీనికిగాను ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు విచ్చేశారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి విచ్చేసిన మాల, మాదిగ, రెల్లి,బుడగ జంగాల వంటి ఎస్సీ ఉపకులాల వారితో కలెక్టరేట్ కిక్కిరిసింది. పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఉపకులాలకు సంబంధించి వర్గీకరణపై ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా వినతులు స్వీకరించారు. ఆయా కులాల నాయకులు,ప్రజలు పోటాపోటీగా ధర్నాలు, నిరసనలు చేశారు. ఎమ్మార్పీస్ పోరాట ఫలితంగా ఉమ్మడి ఏపీలో 1997లో రామచంద్ర రాజు కమిషన్ వేశారని మాదిగ సంఘాలు గుర్తుచేశారు. ఆ కమిషన్ రిపోర్టు ప్రకారం 2000 నుంచి 2004 వరకు ఉమ్మడి ఏపీలో వర్గీకరణ అమలు జరిగిందని ఆయా సంఘాలు పేర్కొన్నాయి. ఉషామెహ్రా కమిషన్ 2008లో ఎస్సీ వర్గీకరణ అవసరమని ప్రకటించారని మాదిగ సంఘాలు తెలిపారు.



కాకినాడలో వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

### వ్యతిరేకంగా నిరసనలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, మాలసంఘాలు నిరసనలు తెలిపాయి. వన్ మ్యాన్ కమిషన్ గోబ్యాక్ అంటూ మాలలు నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. 1972 గణాంకాల ప్రకారం మాలలకు రిజర్వేషన్లు కేటాయించాలని అనుకోవడం సరైనది కాదని వారు అభ్యంతరాలు తెలిపారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

# మిల్లులకు చేర్చేందుకు పాట్లు

- వర్షపు జల్లులకు తడిచిన ధాన్యం రాశులు
- రోజంతా ఆకాశం మేఘావృతం
- మధ్యలో చినుకులు
- అతికష్టం మీద మిల్లులకు తరలింపు





గొల్లప్రోలు పట్టణ శివారులో ధాన్యం తడవకుండా కప్పిన టార్పాలిన్లు

మిల్లు వద్ద ట్రాక్టర్లు

పిఠాపురం/గొల్లప్రోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సార్వా రైతుల కష్టాలు తీరేలా కనబడటం లేదు. ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చి దాళ్వా సాగుపై దృష్టి సారిద్దామని రైతులు భావించినా వాతావరణం వారికి సహకరించడం లేదు. చిరు జల్లులు, చినుకులకు ధాన్యం రాశులు తడిచిపోవడంతో వాటిని ఆరబెట్టేందుకు పాట్లు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమయి ఉండటంతోపాటు చిరుజల్లులు పడుతుండటంతో పొలాల్లో పంట ఉన్న రైతులకు కంటి మీద కునుకు కరువైంది. సార్వా వరి కోతలు, మాసూళ్లు 90 శాతం వరకూ పూర్తయినప్పటికి గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల పరిధిలో ధాన్యం రాశులు పంటపొలాలు, కళ్లాలు, రహదారులు వెంబడి ఉండిపోయాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో ఆరిన దాన్యం రాశులను రైతులు మిల్లులకు తరలించారు. ఇంకా తేమ శాతం అధికంగా ఉన్న ధాన్యం పొలాలు, కళ్లాల్లోనే ఉండిపోయాయి. ఒకవైపు చినుకులు పడుతున్నా మరోవైపు రైతులు ధాన్యం రాశులను ఆరబెడుతూనే ఉన్నారు. బుధవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకూ సుమారు మూడు గంటల పాటు జల్లులు పడ్డాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మూడు పర్యాయాలు చినుకులు పడటంతో అక్కడక్కడా ధాన్యం రాశులు తడిచాయి. వీటిని ఆరబెడుతూనే ధాన్యాన్ని సాధ్యమయినంత త్వరగా మిల్లులకు తరలించేందుకు రైతులు ఆరాటపడుతున్నారు. ఇదే అదనుగా దళారులు రంగ ప్రవేశం చేసి తక్కువ ధరకు అడుగుతుండటంతో కొందరు రైతులు ధాన్యాన్ని ఇంటికి లేదా గోదాములకు తరలిస్తున్నారు. టార్పాలిన్లు కప్పి ధాన్యం బస్తాల లోడుతో ఉన్న ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు మిల్లుల వద్ద గురువారం బారులు తీరి కనిపించాయి. శుక్రవారం కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యం రాశులను కాపాడుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు.



యాంకరేజ్ పోర్టులో నిలిచిన ప్రక్రియ

### నిలిచిపోయిన బియ్యం తరలింపు ప్రక్రియ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో సముద్రంలో ఉన్న నౌక నుంచి పీడీఎస్ బియ్యం ఒడ్డుకు చేర్చే ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. కాకినాడ సముద్రతీరంలో ఉన్న స్టెల్లా ఎల్ పనామా నౌకలో అధికారులు తనిఖీలు చేసి 1320 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో లంగరు రేవులో బార్జిలో గుర్తించిన 1064 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఒడ్డుకు చేర్చి ప్రభుత్వ గోదాముల్లో భద్రపర్చాలనుకున్న అధి కారులు వెనుదిరిగారు. గురువారం తొలుత బార్జిలో ఉన్న 1064 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీయాలని భారీ క్రేన్లు ఏర్పాటు చేయగా తుఫాను ప్రభావంతో వర్షం కురిసింది. అయితే కొన్ని బియ్యం బస్తాలు ఒడ్డుకు చేర్చిన తర్వాత వర్షం ఎక్కువ అవడంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయింది. వాతావరణం అనుకూలిస్తే శుక్రవారం ఆ బియ్యాన్ని తెచ్చే అవకాశం ఉంది.

## ఉప్పాడలో అలల ఉధృతి



కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీరంలో అలల ఉధృతి గురువారం కూడా కొనసాగుతోంది. కోనపాపపేట, ఉప్పాడ, మాయాపట్నంలో తాజాగా మరో 4 మత్స్యకారుల ఇళ్లు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. ఈదురు గాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. కొత్తపట్నం, సుబ్బంపేట విద్యుత్ ప్లాంటు, నేమాం గెస్ట్ హౌస్ సమీపంలో బీచ్‌రోడ్డు పైకి కెరటాలు విరుచుకొని పడుతున్నాయి. రెండు మూడు నెలలుగా ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చే అల్పపీడనాలతో చేపల వేట చేసేందుకు వీలులేకపోవడంతో పూట గడవడం కష్టంగా ఉందని మత్స్యకారులు వాపోతున్నారు.

### వర్షపాతం వివరాలు

కాకినాడ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గడిచిన 24 గంటల్లో ముసురుపట్టి వర్షం కురిసింది. దీంతో 15.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటనందూరు మండలంలో 4.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా శంఖవరం మండలంలో 0.4 మి.మీ. వర్షపాతం నమదైంది. రౌతులపూడి 3.4, తుని 2.4, కాజులూరు 2.2, ప్రత్తిపాడు 1.2, కాకినాడ అర్బన్ 0.8, తొండంగి 0.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

# భూముల ధరలకు రెక్కలు

- పెరగనున్న మార్కెట్ విలువ
- 10 శాతం నుంచి 35 శాతం
- పెంపునకు కసరత్తు
- జనవరి 1 నుంచి అమలుకు చర్యలు

సామర్లకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్, ఐజీ మిరియాల వెంకట శేషగిరిబాబు నుంచి అధికారిక ఉత్తర్వులు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రేషన్లు-స్టాంపులశాఖ అధికారులు నివేదికలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. గురువారం ఆయా పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లను, గ్రామాల్లో పంచాయతీ అధికారులను రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు కలిసి ప్రస్తుత మార్కెట్ విలువలను అధికారికంగా సేకరించారు. బహిరంగ మార్కెట్లో భూములకు విలువలు అధికంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ విలువలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మరో వైపు ప్రభుత్వ ప్రజావసరాల కోసం భూములను కొనుగోలు చేసే సందర్భాలలో భూములు అమ్మేవారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మధ్య తేడా తక్కువగా ఉంటే అమ్మేవారికి, కొనే వారికి నష్టం ఉండదు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10 శాతంనుంచి 35శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగా రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు నివేదికలు తయారు చేసినట్లు తెలిసింది. ఆర్డీవోలు, కౌడా అధికారులను సంప్రదించి భూ విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జేసీ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరపనున్నారు. ఈ సమావేశంలో అధికారులు తయారుచేసిన నివేదికలపై చర్చించనున్నారు. ప్రజా వ్యతిరేకత లేకుండా భూవిలువలను పెంచాలని ప్రభుత్వం నుంచి మౌఖికంగా ఆదేశాలు రావడంతో ఆ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### జనవరి 1 నుంచి...

జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో సెంటు(48 చదరపు గజాలు) భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో, లక్షల్లో ఉంటుంది. ఎకరా భూమి రూ.5కోట్ల వరకూ పలుకుతోంది. అయితే రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూములు మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈ సారి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ విలువలు పెరగనున్నాయి. ఈ నెల 20న పెంపుదల ప్రతిపాదనల మార్కెట్ విలువలను నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారు. 24 వరకూ ప్రజల అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని 26న పరిశీలించి 27న తుది జాబితాను జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలపనుంది. 2025 జనవరి 1 నుంచి పెంచిన మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురానున్నారు. రాజానగరం ఏడీబీ రోడ్డు వెంబడి సామర్లకోట మండలం అచ్చంపేట జంక్షన్ వరకూ రోడ్డుకిరువైపులా ఎకరా భూమి బహిరంగ మార్కెట్లో రూ.8కోట్ల నుంచి రూ.10కోట్ల వరకూ ధర పలుకుతుంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.60లక్షల నుంచి రూ.80లక్షల వరకూ మాత్రమే ఉంది. పెద్దాపురం ఏడీబీరోడ్డులో సైతం ఎకరాకు రూ.25లక్షల లోపు మాత్రమే ఉంది. ఇదే రీతిలో పలు పట్టణ ప్రాంతాలలో కూడా చదరపు గజాల మార్కెట్ ధరలు రూ.9వేల లోపు మాత్రమే ఉండగా మూడు రెట్లు అదనంగా ధరలు పలకడం గమనార్హం. భూ ములు కొనుగోలు చేసే సమయంలో మార్కెట్ విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ చెల్లింపులు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం రూ.కోట్ల ఆదాయం కోల్పోతుంది. మరోవైపు రైతులకు మా ర్కెట్‌లో భూమి ధరలు పెంచి భరోసా కల్పిం చేందుకు రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌పై అవగాహన

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబరు 16 నుంచి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 1986 అంగన్‌వాడీ కేంద్రాలు, 1278 పాఠశాలల్లో 2,64,667 విద్యార్థులకు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సిబ్బంది ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రాథమికంగా హెడ్ టూ టో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. స్క్రీనింగ్ చేసిన విద్యార్థుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నామన్నారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షించినట్లు తెలిపారు.

## రైతులకు తీపి కబురు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైతులకు ఇది తీపి కబురు. రైతుల పంట రుణాలు రీషెడ్యూల్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రుణాలు రీషెడ్యూల్ చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో భారీ వర్షాలు, ఏలేరు కాలువ ముంపు వలన గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, ప్రత్తిపాడు, జగ్గంపేట, తదితర మండలాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం కూడా అందజేసింది. అయితే పంట రుణాలు రీషెడ్యూల్ కాకపోవడం వలన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో పంట రుణాలు రీషెడ్యూల్ చేశారు. రబీలో సాగుకు పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడానికి కొత్తగా రుణాలు ఇవ్వనున్నారు.




# ఉడ్..డౌడ్!

## సిమెంటు గుమ్మాలే ముద్దు

**పెరిగిన వినియోగం - వ్యయ తగ్గింపులో భాగం**

**కలపకు ప్రత్యామ్నాయంగా వాడుక**




పెరవలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేటు డూప్లికేటు అన్నట్టు.. ప్రతి దానికి ప్రత్యామ్నాయం వచ్చేసింది..ఇదీ అటువంటిదే.. పూర్వం ఇంటి నిర్మాణంలో గుమ్మాలు, కిటీలకు కలపనే వాడేవాడు.. ప్రస్తుతం నాణ్యత కలిగిన కలప దొరకడమే గగనంగా మారింది..పోనీ కలప కొందామని వెళ్లినా గుమ్మాలు.. కిటికీలకే లక్షలు పోయాల్సిందే. అదే సిమెంట్ గుమ్మా లైతే వేలల్లో తేలిపోతోంది. రేటు తక్కువగా ఉండడం, దీర్ఘకాలం చెదలు పట్టకుండా ఉండ డం వంటి కారణాలతో ప్రస్తుతం ప్రతి ఒక్కరి చూపు అటు వైపే ఉంటుంది. కొంత మంది ప్రధాన సింహ ద్వారానికి టేకు,లేదా వేప లేదా ఇతర రకాల కలపతో తయారైన గుమ్మాలను పెట్టి మిగిలిన వాటిని సిమెంటు గుమ్మా లు అమర్చుతున్నారు.వాటికి తలుపులు ప్లైవుడ్ గాని,ఫైబర్ గాని తో తయారైన వాటిని బిగిస్తున్నారు. దీని వల్ల ఖర్చు ఆదా అవుతుందనేది గృహ నిర్మాణదారుల మాట. కలప గుమ్మాలు, కిటికీలు తయారు చేయించి అమర్చాలంటే లక్షలాది రూపాయలు వ్యయం చేయాల్సి వస్తుంది. ఖర్చును తగ్గించుకోవడం కోసం సిమెంటు గుమ్మాలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సిమెంటు గుమ్మాలు,కిటికీల తయారీ పరిశ్రమలు పెరిగాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో నాలుగైదేళ్లలో మూడు పరిశ్రమలు వెలిశాయంటే ఎంతగా డిమాండ్ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. సిమెంటు గుమ్మం ఖరీదు సైజును బట్టి రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతుండగా అదే కలపతో తయారు చేసిన గుమ్మం రూ.5 వేల నుంచి రూ.10 వేలు పలుకుతుంది. కిటికీ సైజును బట్టి రూ.1000 నుంచి రూ.3 వేల వరకు ,సిమెంటు కిటికీలు ఉండగా కలపతో చేసినవి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటు న్నాయి. సాధారణ రకాలైతే ఇలా..మద్ది,టేకు.. ఎర్రచందనం తదితర రకాల కలపైతే ధర ఊహించలేం. దీంతో ఎక్కువ మంది సిమెంటు గుమ్మాలను పెట్టుకుంటున్నారు. కిటికీలకు ఐరన్ వాడుతున్నారు. వాటికి ఉడ్‌లా కనిపించేలా రంగులు వేస్తున్నారు.



### రెండు మూడేళ్లగా వినియోగం పెరిగింది



సుమారు ఐదేళ్ల కిందట పెరవలిలో సిమెంటు గుమ్మాలు, కిటికీలు తయారీ పరిశ్రమ పెట్టా. గత రెండు మూడేళ్లగా వీటికి డిమాండ్ పెరిగింది. కర్ర గుమ్మాలతో పోలిస్తే వీటికి ఖర్చు తక్కువ.దీంతో చాలా మంది మక్కువ చూపుతున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం.

**- కలిదిండి శ్రీనివాస్, తయారీదారుడు, పెరవలి**

### కొంగల గుంపు.. సందడి..



కొంగలు గుంపులు.. గుంపులుగా సందడి చేశాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఒక పంట పొలంలో కొంగలు ఇలా సందడి చేశాయి. ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా వందలాది కొంగలు రైతులకు మేలు చేకూర్చేలా పొలంలోని పురుగులను తిన్నాయి. ఈ దృశ్యం కనువిందు చేసింది.

**-ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి)**



# మహాకుంభమేళాకు.. వెళ్లిరండిలా!

- ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ రైళ్లు
- మహాకుంభమేళా వీక్షణకు వచ్చేనెలలో 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట ప్రత్యేక రైలు
- కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ దర్శించుకునే అవకాశం
- వచ్చేనెల 19న సికింద్రాబాద్‌లో మొదలై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణం
- రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని రైల్వేస్టేషన్లలో హాల్టు
- మొత్తం 8రోజులపాటు ప్రయాణం

**ఆంధ్రజ్యోతి/సామర్లకోట**

**మహాకుంభమేళా చూడాలనుకుంటున్నారా? లక్షలమంది జనం.. భక్తితత్వంతో కూడిన భగవన్నామ స్మరణ.. అలాంటి దృశ్యం చూస్తేనే అద్భుతం.. అమోఘం.. దీన్ని కనులారా చూడాలనుకుంటే ఈ కథనంలోకి పదండి..**

దేశంలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భారత్ గౌరవ్ రైళ్లను భారత రైల్వే ఆధ్వర్యంలో ఐఆర్‌సీటీసీ నడుపుతోంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో జరిగే కుంభ మేళాను వీక్షించేందుకు పలు రైళ్లను 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట నడుపుతున్నారు. వీటిలో భాగంగా ఒక రైలు సికింద్రాబాద్ నుంచి వచ్చేనెల 19న బయలుదేరనుంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించనుంది. దీనికి రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని హాల్టులు కేటాయించారు.

### దేశవ్యాప్తంగా పలు రైళ్లు

వచ్చేనెల 19న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనున్న ఈ రైలు 8రోజుల తర్వాత తిరిగి అదే రైల్వేస్టేషన్‌కు చేరుకోనుంది. ఈ ప్రత్యేక భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మహాకుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట నామకరణం చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తు న్న ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఉత్త ర్‌ప్రదేశ్‌లోని వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనుంది. దీనికి సంబం ధించి ప్రయాణ ప్యాకేజీని ఇదివరకే రైల్వే అధికారులు ప్రకటించారు. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొ రేషన్(ఐఆర్‌సీటీసీ) నుంచి మంచి ఆదరణ లభించినట్లు అధికారులు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 576 సీట్లు బుక్ చేసు కునే అవకాశం కల్పించారు. దేశంలో ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలను అనుసంధానిస్తూ రైల్వే మం త్రిత్వ శాఖ భారత్‌గౌరవ్ పేరిట ఈ తరహా ప్ర త్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటికి ప్రయా ణికుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్‌నుంచి అయోధ్య, వారణాసికి ఈ ఎక్స్‌ప్రెస్ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 7 రాత్రిళ్లు, 8 పగళ్లు ఈ రైలు ప్రయాణం సా గనుంది. ఈ తరహాలోనే పూణే, తిరునేల్‌వేళి, ఇండోర్, పూరీ, పుదుచ్చేరి, రాజ్‌కోట్, కోయంబ త్తూర్, కోల్‌కత్తా, ఉదయ్‌పూర్, జయసల్మేర్‌లనుంచి మహాకుంభ్‌మేళా పుణ్యక్షేత్ర యాత్ర పేరిట ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లో వచ్చేనెల 19న మొదలయ్యే ఈ రైలు తెలంగాణలోని భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిరతోపాటు ఏపీలోని విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో హాల్ట్ సదుపాయం ఉంది. ప్యాకేజీలో వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షిదేవి ఆలయాన్ని సందర్శించవచ్చు. అయోధ్యలో శ్రీరామచంద్రుల వారి ఆలయం, హనుమాన్ గర్హి, హారతి, అత్యంత ప్రాచీనమైన సరయూ నదిని దర్శించవచ్చు. ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమం సందర్శనతో ఈ ప్యాకేజీ ముగుస్తుంది. ప్రయాగ్‌రాజ్ నుంచి మళ్లీ ఆయా హాల్టులతో పాటు చివరిగా సికింద్రాబాద్ చేరుకుంటుంది.

### ఈ రైలు టిక్కెట్ ధరలిలా..

| | |
|---|---|
| స్లీపర్.. పెద్దవారికి | - రూ.22,635 |
| పిల్లల(5-11ఏళ్లు)కు | - రూ.21,740 |
| థర్డ్ ఏసీ.. పెద్దలకు | - రూ.31,145 |
| పిల్లలకు | - రూ.30,095 |
| సెకండ్ ఏసీ.. పెద్దలకు | - రూ.38,195 |
| పిల్లలకు | - రూ.36,935 |

ఈ రైలు వచ్చే ఏడాది.. అనగా 2025, జనవరి 19న సికింద్రాబాద్‌నుంచి బయలుదేరనుంది. దీనికి 576 సీట్లు రిజర్వేషన్‌కు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం సెకండ్ ఏసీలో టిక్కెట్ల బుకింగ్ క్లోజ్ అయింది. థర్డ్‌ఏసీ, స్లీపర్‌లో బుకింగ్‌కి అవకాశం ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో 17 హాల్ట్‌లు ఇవ్వగా వాటిలో మన జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని నుంచి బుక్ చేసుకునే అవకాశం ఉంది.



## ఉత్కంఠభరితంగా..

# బాక్సింగ్ పోటీలు

- పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన 150మంది బాక్సర్లు



పిఠాపురంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పోటీపడుతున్న బాక్సర్లు

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 150మంది బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాక్సర్ల మధ్య పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి టీఏ లక్ష్మణదేవ్, కోశాధికారి శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ డి.నాగేశ్వరరావులు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను ప్రేక్షకులు తిలకించేందుకు తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. లక్ష్మణరావు పర్యవేక్షించగా, మునిసిపల్ కోఆప్షన్ సభ్యు డు గండేపల్లి బాబీ, కొత్తప ల్లి బుజ్జి, ప్రభుత్వ జూనియ ర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఉన్నత పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోశాధికారి నవీన్ పాల్గొన్నారు.

### సెమీస్‌కు చేరింది వీరే..

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రౌండ్ల వారీగా పోటీల అనంతరం సెమీఫైనల్‌కు 47.5 కిలోలవిభాగంలో పి.పవన్(విశాఖజిల్లా), ఎస్.రాంబాబు(కాకినాడ), వై.ప్రభుదాస్(తిరుపతి), ఎం.జయంత్ సాయిస్వరూప్(మన్యం), 50-55 కిలోల విభాగంలో బాలగణేష్‌రెడ్డి(కడప), పి.ప్రసాద్(అనంతపురం), సూర్యదేవేందర్(నంద్యాల), జ్ఞానేశ్వర్(శ్రీకాకుళం), 55-60 కిలోల విభాగంలో డి.సందీప్(విశాఖ), ఎస్కే బాజీబాబా(ఎన్టీఆర్‌జిల్లా), పి.దిగ్విజయ్(కడప), పి.అప్పలరాజు(శ్రీకాకుళం), 60-65కిలోల విభాగంలో పి.విశేశ్వరరావు(శ్రీకాకుళం), జయసాయితరుణ్(నెల్లూరు), ఎన్.సతీష్(పశ్చిమగోదావరి), భానుప్రకాష్(విశాఖ) చేరుకున్నారు. మిగిలిన విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

## అన్నవరంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వి.తమిళసెల్వీ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు పెన్నాడ వెంకటేశ్వరరావు, గణపతిలు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



వేదాశీర్వచనం పొందుతున్న తమిళసెల్వీ

# ఎన్నెన్నో అందాలు!

- మోతుగూడెంలో ఆకట్టుకుంటున్న ప్రకృతి రమణీయ దృశ్యాలు



చింతూరు మండలం మోతుగూడెంలో పొల్లూరు జలపాతం



మోతుగూడెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఎన్నెన్నో అందాలు.. అన్నింటా కట్టి పడేసే చూడచక్కని ప్రదేశాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీప్రాంతమైన చింతూరు మండలం మోతుగూడెం, డొంకరాయిల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఈ అందాలను స్వయంగా చూస్తేనే మనం మంచి అనుభూతి పొందగలం. చింతూరు మండలం మోతుగూడెం, వై.రామవరం మండలం డొంకరాయి పచ్చని కొండలు.. వాటినుంచి జాలువారే జలపాతాలు.. అదే ప్రాంతాల్లోని జలవిద్యుత్ కేంద్రాలు, వాటి రిజర్వాయర్లు, ప్రాజెక్టు ప్రదేశాల్లోని జలప్రదేశాలు పర్యాటకులకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. అక్కడ గిరిజన గ్రామాలు పచ్చని పంట చేల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వీటిని సందర్శించడానికి మంచి సీజన్. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఇక్కడి అందాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడ అందాలపై ఎన్నో సినిమాలు కూడా తీశారు. ఇటీవల సంచలనం సృష్టించిన పుష్ప-1, పుష్ప-2 చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. వారాంతాల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ జలపాతాల వద్ద మాత్రం జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.



సీలేరు నదిలో పుష్ప చిత్రం షూటింగ్ జరిగిన ప్రదేశం



చింతూరు మండలం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



# పెద్దపులి ఎక్కడ?

- ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీలో వీడని భయాందోళన



ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో పులి పాదముద్రలు(ఫైల్)

ప్రత్తిపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచారం స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో ఇటీవల సంచరించిన పెద్దపులి ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారింది. 15రోజులక్రితం బురదకోట అటవీప్రాంతంలోని బాపన్నదార వద్ద లేగదూడను పెద్దపులి చంపి కొద్దిపాటి మాంసాన్ని తినడం ఆ ప్రాంతంలో సంచరించడం, పులి పాదముద్రలను అటవీశాఖాధికారులు గుర్తించడం వంటివి తెలిసిందే. పెద్దపులి ప్రస్తుతం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. పులిజాడ ఆచూకీ ఒకవైపు తెలియకపోవడం, మరోవైపు మళ్లీ సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలోకి వస్తుందేమోనని స్థానికుల్లో భయాందోళన వీడలేదు. పెద్దపులి మళ్లీ రావచ్చనే అభిప్రాయంతో అటవీశాఖాధికారులు బురదకోట అటవీప్రాంతంలో ఆరు ట్రాప్ కెమెరాలు పెట్టారు. రెండు వారాలు గడుస్తున్నా అవి ఇంకా ఉంచారు. దీంతో పులి మళ్లీ బురద కోట అటవీప్రాంతంతోపాటు సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలో సంచరించవచ్చనే భయాందోళనలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులను వెంటాడుతున్నాయి.

### అడ్డతీగల అటవీప్రాంతం వైపే..

బురదకోట అటవీప్రాంత సమీపంలో ఉన్న రాజవొమ్మంగి అటవీప్రాంతంలో ఆరు రోజుల కిందట పెద్దపులి సంచరించడాన్ని చూసిన ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి ఆస్పత్రిలో చేరారు. దీంతో పులి ఆ అటవీప్రాంతంలో ఉందనడానికి బలం చేకూరింది. ప్రస్తుతం పెద్దపులి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా అడ్డతీగల అటవీ ఫారెస్ట్‌లోకి వెళ్లినట్లు అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ, రాజవొమ్మంగి అడ్డతీగల అటవీ ప్రాంతం కలిసి ఉండడంవల్ల ఈ ఫారెస్ట్‌లోనే పులి తిష్ఠ వేసినట్లుగా పలువురు భావిస్తున్నారు. పెద్దపులి సంచారంపై ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గారాం ప్రసాద్‌ను వివరణ కోరగా అడ్డతీగల అటవీప్రాంతం వైపు వెళ్లినట్లు సమాచారం ఉందని, బురదకోట అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలు ఇంకా తొలగించలేదని స్పష్టం చేశారు.

## బలిఘట్టం సత్యదేవుడి ఆలయం పరిశీలన

- స్థానిక అధికారులతో కలిసి పర్యటించిన అన్నవరం ఈవో

అన్నవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయాన్ని అన్నవరం ఈవో ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు అక్కడి దేవస్థానం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా ఈనెల 6న అన్నవరం దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకుంది. ఈ నేపథ్యంలో అక్కడి ఆలయంతోపాటు ఆలయ ఆధీనంలో ఉన్న భూముల రికార్డులు, ఇతర వివరాలను అన్నవరం ఈవో సుబ్బారావు తెలుసుకున్నారు. అక్కడ ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఉపకమిషనర్ చంద్రశేఖర్, పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

# టమోటా.. కిలో రూ.5



» నేల చూపులు చూస్తున్న టమోటా
» అయోమయంలో రైతులు

గండేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టమోటా ధర పెరుగుతూ తగ్గుతూ రైతులను నష్టాల్లోకి నెట్టేస్తోంది. ఒకానొక సమయంలో కిలో రూ.200 పలికిన కిలో టమోటా ధర ఇప్పుడు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో కిలో రూ.20 ఉన్న ధర ఒక్కసారిగా రూ.5కు పడిపోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు. కోత కూలీ కూడా రాక ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో నష్టాలు ఎదుర్కొంటున్నారు. మదనపల్లి నుంచి లోకల్ మార్కెట్‌లకు సరుకు భారీగా దిగుమతులు కావడంతో ఇక్కడ పండించిన టమోటా ధర పడిపోతోందని వ్యాపారులు అంటున్నారు. రిటైల్ వ్యాపారస్తులు హోల్‌సేల్ మార్కెట్‌లో తక్కువకు కొని వినియోగదారులకు రూ.5నుంచి రూ.10 మధ్య విక్రయాలు చేస్తున్నారు.

# ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకేజీ

» పోలీసులు అప్రమత్తం.. తప్పిన ప్రమాదం
» అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



రాజానగరం సమీపంలో హైవేపై పడిన యాసిడ్‌ను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్‌వద్ద గురువారం తెల్లవారుజామున ప్రయాణిస్తున్న ట్యాంకర్‌నుంచి యాసిడ్ (హెచ్‌సీఎల్) లీక్ అవడంతో ప్రయాణికులు ఆందోళనకు లోనయ్యారు. విశాఖ నుంచి యాసిడ్ ట్యాంకర్ దేవరపల్లి బయలుదేరింది. మార్గమధ్యలో జీఎస్ఎల్ సమీపానికి వచ్చేసరికి ట్యాంకర్ నుంచి యాసిడ్(హెచ్‌సీఎల్) లీకై హైవేపై పడి పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు ట్యాంకర్ డ్రైవర్‌ను సూచించడంతో డ్రైవర్ తక్షణమే ట్యాంకర్‌ను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న రాజానగరం పోలీసులు, హైవే పెట్రోలింగ్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజమహేంద్రవరం, కోరుకొండనుంచి అగ్నిమాపకయంత్ర సిబ్బంది సకాలంలో సంఘటనాస్థలానికి చేరుకుని యంత్రాల సహాయంతో పొగలు వ్యాప్తిచెందకుండా ఉండేలా ట్యాంకర్‌నుంచి యాసిడ్ లీకేజీ కాకుండా అరికట్టారు. లీకేజీ అదుపు చేయకుంటే హెచ్‌సీఎల్ గాలిలో వ్యాపించి స్థానికులకు కళ్లు మండడంతోపాటు శరీరంపై దురదలు, దద్దుర్లు వస్తాయని అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు వివరించారు. హైవేపై వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా తగు చర్యలు చేపట్టారు. ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## వేట్లపాలెం హత్య కేసులో నిందితులకు రిమాండ్

కాకినాడ క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం హత్యాకాండ జిల్లా ప్రజల వెన్నుల్లో వణుకు పుట్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి గురువారం కాకినాడ నాలుగో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిరుపమ భంజ్ డియో 14 రోజుల రిమాండ్ విధించారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఒక ఇంటి నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో ఇరువర్గాల పరస్పర దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని మరో వర్గం అత్యంత పాశవికంగా హత్య చేసి మరో ఏడుగురిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితులైన బచ్చల మోషే, బచ్చల జకర్యా, బచ్చల బిల్లప్ప, బచ్చల దొరయ్య, బచ్చల రాము, బచ్చల గోపి, బచ్చల గవరయ్య, బచ్చల రాజు, బచ్చల సూర్యకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని వ్యక్తి గోపాలపురం శివారులో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంవద్ద మృతిచెందినట్లు ఎస్ఐ కే.సతీష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెందిన జక్కు గంగరాజు(50) మతిస్థిమితం లేక కొద్దిరోజులుగా ఇంటినుంచి బయటకు వెళ్లాడన్నారు. గురువారం మధ్యాహ్నం గోపాలపురం శివారులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదుట అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

సర్పవరంజంక్షన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం పండూరులో చోటు చేసుకుంది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటకు చెందిన ముద్ద సత్యనారాయణ(58) తాపీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తాపీపని కోసం ఇంటినుంచి బయలుదేరి వెళ్లాడు. పని ముగించుకుని గోర్స నుంచి పండూరుకి సైకిల్‌పై వెళ్తున్నాడు. పండూరులో శ్రీడిజిటల్ స్టూడియో సమీపంలోని పాలకేంద్రం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఏపీ యుజె8653 సత్యనారాయణను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముక్కు, చెవి, నోటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడు కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టెన్త్ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చేమార్చిలో నిర్వహించే టెన్త్ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు పాఠశాల లాగిన్‌ల్లో ఎడిట్ ఆప్షన్ ఎంపిక ప్రారంభిస్తామని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డుల్లోను, విద్యార్థి అపార్ ఐడీలో నమోదు చేసిన అన్ని దరఖాస్తులను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఇంతకుముందు తప్పులు చేసిన ప్రధానోపాధ్యాయులు ఈనెల 23 వరకూ పాఠశాల లాగిన్‌లో ప్రారంభించే వెబ్ అప్లికేషన్‌లోని విద్యార్థులకు అవసరమైన ఫీల్డ్‌లో సవరణ లుంటే సరిచేసేందుకు ఎడిట్ ఎంపిక అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. లోపాలు లేని డేటాను హాల్ టికెట్‌లకు అప్‌డేట్ చేయాలని డీఈవో సూచించారు.

## నేడు కౌన్సెలింగ్ పద్ధతిలో పదోన్నతుల ప్రక్రియ

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియను శుక్రవారం కౌన్సెలింగ్ పద్ధతిలో కాకినాడ డీఈవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరచిన సీనియారిటీ లిస్టులో తెలిపిన ఉపాధ్యాయులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ముందుగా ధ్రువపత్రాల పరిశీలన తర్వాత పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

## నేటినుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

కాకినాడసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 22 వరకు మూడురోజులు కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలోని మల్టీ ఆడిటోరియంలో అంతర్ జిల్లాల, రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ విజయ ప్రకాష్, కె.మోహన్‌బాబు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 16 జిల్లాల నుంచి వివిధ విభాగాల్లో 575 ఎంట్రీలు నమోదయ్యాయన్నారు. ఈ పోటీలు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ వి.భాస్కరరామ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎస్ ప్రకాషరావు, పి.విశ్వనాథ్, కాకినాడ చైర్మన్ రావు చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామ న్నారు. పోటీలకు చీఫ్ రిఫరీగా రమణారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా పి.వేణు వ్యవహరిస్తారన్నారు.అతిథులుగా ఓఎన్జీసీ ఈడీ కె.రత్నేష్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగమణి, కాకినాడ ఏపీఎస్పీ మూడోబెటాలియన్ అధికారిణి ఎం.దీపికా పాటిల్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ సహా పలువురు విచ్చే యనున్నారని తెలిపారు.

## రైలు ఢీ కొని వ్యక్తి మృతి

నిడదవోలు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నిడదవోలు రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గురువారం రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన రాకుర్తి నాగేంద్రరావు(54) మృతిచెందాడు. మృతుడు రాజమండ్రిలో ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు.

# ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై.. 311 వినతులు

» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 2468 మంది హాజరు
» కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ





కాకినాడ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతులు అందజేస్తున్న మాదిగ, మాల సంఘాల ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలవారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కాకినాడ జిల్లా కలెక్టరేట్ హాలులో ఉమ్మడి జిల్లాలో భాగమైన నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎస్సీ ఉపకులాలవారీగా జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఎస్సీ ఉపకులాల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన 2468 మంది నుంచి వర్గీకరణపై 311వినతులు స్వీకరించారు.

సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన 2011 జనాభా గణన ఆధారంగా ఎస్సీ ప్రజల గణాంకాలను ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వివరించారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం జనాభా 52,85,824మంది ఉండగా ఇందులో 9,57,302మంది(18.11 శాతం) ఎస్సీ జనాభా ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత 70.50శాతం ఉండగా, ఎస్సీ కులాల జనాభాలో అక్షరాస్యత 69.37 శాతంగా ఉందన్నారు. పురుషుల్లో 72.96శాతంగా, మహిళల్లో 65.79శాతం అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వీరిలో ప్రధానంగా 68.507 శాతం మాల, మాల అయ్యావారు వర్గం, 22.132శాతం మాదిగ వర్గం, 4.873శాతం ఆది ఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉపకులాల్లో ఒకటి కంటే తక్కువ శాతం ఉన్నారని వివరించారు. అనంతరం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక ఆర్థిక, రాజకీయ స్థితిగులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ కాకినాడ జిల్లాలో గురువారం పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశాలపై ఆయా షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు నుంచి వచ్చిన మొత్తం 311 వినతులను ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా స్వీకరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఎస్సీ ఉపకుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

# బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా.. అదుపుతప్పి పడిపోయి..

» సంఘటనాస్థలంలోనే వ్యక్తి మృతి
» మరో యువకుడికి తీవ్రగాయాలు



సంఘటనాస్థలంలోనే మృతిచెందిన శ్రీను

దివాన్‌చెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తూ వాహనం అదుపుతప్పి పడిపోయి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు దగ్గర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బొమ్మూరు ఎస్ఐ ఎస్పీ కుమార్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన చుక్కా శ్రీను(38) తన అత్తవారి గ్రామమైన రాజానగరం మండలం శ్రీరాంపురంలో నివాసం ఉంటున్నాడు. అతడు కూలీ పని చేసుకుని జీవిస్తుంటాడు. కాగా, గురువారం సాయంత్రం అతడు శ్రీరాంపురం అత్తవారింటికి వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో ఓ విద్యార్థి బైక్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కాడు. వారు దివాన్‌చెరువునుంచి శ్రీరాంపురం రోడ్డులోని శ్రీచైతన్య టెక్నోస్కూల్ వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. ఈ ప్రమాదంలో చుక్కా శ్రీను తలకు, శరీరంపైన తీవ్రరక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, పిల్లలు శ్రీరాంపురంలోనే నివాసం ఉంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కుమార్ తెలిపారు. కాగా ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అనదాసు వెంకటరమణ దివాన్‌చెరువు సమీపంలోని ఒక కళాశాలలో ఇంజనీరింగ్ విద్య మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అతడికి చేతికి, తలకు తీవ్రగాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు.

## తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వస్తున్నాయని, బాగా చదవాలని తల్లి మందలించినందుకు బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతపల్లి నైపుణ్య(16) పదో తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో నైపుణ్యకు మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయిని బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించింది. దీన్ని తట్టుకోలేని ఆ బాలిక గురువారం కూరగాయలకు కొట్టే పురుగుమందును తాగింది. ఇది గమనించిన తల్లిదండ్రులు అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతోందని కుటుంబీకులు తెలియజేశారు.

## పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డికి చుక్కెదురు

» తమను పట్టించుకోవడంలేదని మత్స్యకార గ్రామాల్లో ప్రతిఘటన
» సమస్యలు తెలియజేస్తే డిప్యూటీ సీఎం పవన్‌కు విన్నవిస్తానని హామీ

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు మత్స్యకార గ్రామాల్లో గురువారం తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కోనపాపపేటలో సముద్రకోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు ఆయన వచ్చినపుడు అనూహ్యంగా ప్రజలనుంచి ప్రతిఘటన ఎదురైంది. పవన్ కళ్యాణ్ తరఫున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ గ్రామాల్లో ఒకరిద్దరి మాటలకే విలువిస్తూ మిగిలిన వారిని అలక్ష్యం చేస్తున్నారంటూ వీరంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనపాపపేట సెంటర్లో ఎదురైన ఈ ప్రతిఘటనకు మర్రెడ్డి మనస్తాపం చెందారు. నాయకులంతా ఐకమత్యంగా ఉండి తనను కలిస్తే సమస్యలను నమోదు చేసుకొని డిప్యూటీ సీఎంకు నివేదిస్తానన్నారు. తాను అందరినీ సమదృష్టితో చూసుకుంటానన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సముద్ర కోతను పరిశీలించారు.



కోనపాపపేటలో మర్రెడ్డిని నిలదీస్తున్న మత్స్యకారులు

## గొల్లప్రోలులో మద్యం షాపు వద్ద ఘర్షణ

» ఇద్దరికి కత్తిపోట్లు

గొల్లప్రోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని మద్యం షాపు వద్ద గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు. బస్టాండు సమీపంలోని మద్యంషాపు వద్ద సైకిల్ పడిపోయిన విషయంలో జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఒక మైనర్ బీరు బాటిల్, కత్తితో దాడికి దిగినట్లు చెబుతున్నారు. ఈ ఘర్షణలో జి.నాగేశ్వరరావు, ఎ.వీరబాబు కత్తిపోట్లకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం తర్వాత కాకినాడ జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మైనర్‌కు మరో ఇద్దరు సహకరించినట్లు సమాచారం. మద్యం షాపు వద్ద జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.



కత్తిపోట్లకు గురై గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి

## రెండు జాతీయ రహదారులు

» జీలుగుమిల్లి టూ పట్టిసీమ
» పట్టిసీమ టూ కొవ్వూరు
» సీఎం ఆదేశంతో కదలిక

రాజమహేంద్రవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అనుకూలంగా జీలు గుమిల్లి నుంచి పట్టిసీమ వరకూ అక్కడినుంచి ఏటిగట్టు వెంబడి జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదన ఏడేళ్ల కిందటే ఉన్నప్పటికీ, ఇటీవల పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు ఆదేశంతో మళ్లీ కదిలింది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కన్నాపురం, కెఆర్‌పురం, దొండపూడి మీదగా పట్టిసీమ వరకూ ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. జీలుగుమిల్లి నుంచి కొంతమేర ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇక పట్టిసీమ నుంచి ఏటిగట్టును విస్తరించుకుంటూ కొవ్వూరు టౌన్ వరకూ కూడా జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం అధికారులతో సమీక్షించారు. ఇటీవల పోలవరం వచ్చిన సీఎం ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా హైవే నిర్మాణంపై కూడా దిశా నిర్దేశం చేశారన్నారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తున్న హైవేకు సంబంధించిన భూసేకరణపై సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 23, 26వ తేదీల్లో ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.

## చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

» ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి



క్రికెట్ ఆడి జట్టు ఎంపికలు ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యమివ్వాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం జరగ్గా వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూ ఆటలు ఆడాలన్నారు. ఎంపికల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో క్రీడాభివృద్ధికి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు అన్నీ కృషిచేయాలని సూచించారు. కార్యనిర్వాహక కార్యదర్శి వీవీఎంయూ ఫణీంద్ర మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని 40 నుంచి 50 కళాశాలల నుంచి 80 నుంచి 90 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారన్నారు. ఇక్కడ బాగా ప్రతిభ కనబరచిన 16మందితోపాటు మరో ఆరుగురు క్రీడాకారులను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేస్తామన్నారు. వచ్చేనెలలో తమిళనాడులో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ లింగారెడ్డి, విద్య కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, మూర్తి, రామ్‌గోపాల్ సత్యనారాయణ, సాల్మన్‌దేవానంద్ పాల్గొన్నారు.

## వైద్యుల నిర్లక్ష్యంతో బాధితురాలి రోధన

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వేడినీళ్లు పడి శరీరం కాలిపోయి రోధిస్తూ ఆస్పత్రికి వచ్చిన రోగికి సరైన వైద్యం అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రోగి బంధువులు గురువారం విలేఖర్లకు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ఎలిపే ఇందిరమ్మ బుధవారం రాత్రి ఇంట్లో వంట వండే సమయంలో వేడి నీళ్లు మీదపడ్డాయని వారు తెలిపారు. దీంతో శరీర ఉదర భాగమంతా కాలిపోవడంతో హుటాహుటినా ఆమెను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి అర్థరాత్రి సమయంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తెల్లవార్లు ఆమె కాలిన గాయాలతో రోధిస్తూనే ఉందన్నారు. ఆస్పత్రి సిబ్బంది కొంత మేర వైద్యంఅందించినా బాధితురాలికి పూర్తిస్థాయిలో వైద్యసేవలందించలేదన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన మిగిలిన వైద్యులు ఆమెను పరిశీలించి శరీరంలో ఉదరభాగం 20శాతం కాలిపోయిందని రిజిస్టర్ పరిశీలించగా కనీసం ఆ బాధితురాలి పేరు నమోదు కాకపోవడంతో నివ్వెరపోయినట్లు తెలిపారు. మెరుగైన వైద్య కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లాలని బాధితురాలి బంధువులకు వైద్యులు సూచించారు. దీంతో ఆగ్రహించిన వారు వైద్యురాలిని నిలదీయగా హడావుడిగా వైద్యంఅందించి మధ్యాహ్నం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై ఆస్పత్రి సూపరిండెంటెండ్ వైద్యులు చైతన్యరాజును వివరణ కోరగా డ్యూటీ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

# పవన్ ఫొటో లేకపోవడంపై జనసైనికుల ఆగ్రహం



సమావేశం వేదికపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో పవన్‌కల్యాణ్ ఫొటో లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న జనసైనికులు

- అప్పటికప్పుడు నూతన బ్యానర్ ఏర్పాటు
- చంద్రబాబు ఫొటో లేకపోవడం, టీడీపీ బ్యానర్ తొలగింపుపై వర్మ మండిపాటు
- సమావేశం నుంచి వెనుతిరిగిన టీడీపీ నేత
- రసాభాసగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో పవన్ ఫొటో లేకపోవడంపై జనసైనికుల ఆగ్రహం, కొత్త బ్యానర్ ఏర్పాటు, అందులో చంద్రబాబు ఫొటో లేకపోవడం, టీడీపీ బ్యానర్ తొలగింపుతో మాజీ ఎమ్మెల్యే వర్మ మండిపాటు ఇలా కార్యక్రమం రసాభసగా మారింది.

పిఠాపురం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వాసుపత్రి) ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం సాయంత్రం ఏర్పాటుచేశారు. సమావేశం వేదిక వద్దకు చేరుకున్న జనసేన నేతలు అక్కడ ఏర్పాటుచేసిన బ్యానర్‌లో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటో లేకపోవడంపై జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఉండాలి కదా అని అసంతృప్తి ప్రకటించారు. సమావేశాన్ని ప్రారంభించేందుకు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత సన్నద్ధమయ్యారు. ఈదశలో జనసైనికులు ఆమె ప్రసంగాన్ని అడ్డుకోవడంతోపాటు పవన్ ఫొటో లేకపోవడంపై నిరసన తెలిపారు. వారికి నచ్చచెప్పేందుకు కుడా చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులు ప్రయత్నించినా వినలేదు. పవన్ ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటుచేసే వరకూ సమావేశాన్ని నిర్వహించేందుకు వీలులేదని స్పష్టం చేశారు. ఆసుపత్రి సిబ్బంది అప్పటికప్పుడు పవన్ ఫొటోతో నూతన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.



చంద్రబాబు ఫొటో లేకపోవడంపై వెనుతిరిగిన మాజీ ఎమ్మెల్యే వర్మ

### చంద్రబాబు ఫొటో ఎక్కడ

కొత్తగా ఏర్పాటు చేసిన బ్యానర్‌పై సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంతో, మరోచోట అతి చిన్న ఫొటో ఉండటంతో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా వర్మ ఫొటోతో ఉన్న బ్యానర్‌ను తొలగించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన వర్మ, టీడీపీ శ్రేణులు వేదిక దిగి అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. వర్మతోపాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయాల్సిన వే ణుం సురేష్, ఇతర టీడీపీ నేతలు ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లిపోయారు. కూటమి నేతలందరికీ సమాచారం ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక పార్టీ వారికే సమాచారం ఇవ్వడాన్ని టీడీపీ నేతలు తప్పుపట్టారు. అనంతరం బొజ్జా కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించి కార్యక్రమాన్ని కొనసాగించారు.

# సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- ఐసీఏఆర్, ఎన్‌బీఏఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సంపత్

పెద్దాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సస్యరక్షణ చర్యల తోనే దుంపపంట సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఇండి యన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్), నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చరల్ ఇన్‌సెక్ట్ రిసోర్స్ (ఎన్‌బీఏఐఆర్) శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సంపత్ (యాంటమాలజీ, బెంగళూరు) అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, కట్టమూరు, పెద్దాపురం, కొండపల్లి, వాలు తిమ్మాపురం గ్రామాల్లో సాగులో ఉన్న కర్రపెండలం సాగును ఉద్యానశాఖాధికారిణి నూనే సుజాతతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. కర్రపెండలం పంటలో పిండినల్లి ఆశించిన దాఖలాలు లేవన్నారు. తమిళనా డు, కేరళ రాష్ట్రాల్లో ఈరకమైన పిండినల్లి సమస్య ఉందని, రైతులు విత్తన కర్రని తీసుకువచ్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సునీత, వీహెచ్ఏలు చిలకమ్మ, సత్య, చంద్రరావు, మల్లిక పాల్గొన్నారు.

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

# కార్పొరేట్‌కు దీటుగా పిఠాపురం ఆసుపత్రి

- ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తాం
- ఏపీఎస్ఎంఐడీసీ చైర్మన్ చల్లపల్లి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం(ప్రభుత్వాసుపత్రి)ను అభివృద్ధి చేస్తామని ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఇప్పటికే ఒక బృందం ఆ పనిలో ఉందని తెలిపారు. పిఠాపురం సీహెచ్‌సీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే పవన్ చొరవతో 100పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌కు జీవో జారీ కావడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.38కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా వివిధ విభాగాల్లో స్పెషాలిటీ వైద్యులను నియమించడంతోపాటు సిబ్బంది నియామకం, అదనపు భవనాల నిర్మాణం చేపడతామని వివరించారు. జీప్లస్‌టూ పద్ధతిలో భవనాలు నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వాటిని పవన్ ఆమోదించిన తర్వాత కార్యాచరణ మొదలవుతుందని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వైద్యరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, జగన్ ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాత్రం ఎమ్మెల్యేగా నెగ్గిన నాటి నుంచి పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బొజ్జా కుమార్‌బాబుతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత, సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రత్నరాజు, డీఈ చక్రవర్తి, ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రికి తయారు చేస్తున్న ప్రతిపాదనలపై అధికారులు, వైద్యులతో చర్చించారు.

## మహాసంస్థానంలో హుండీల లెక్కింపు



హుండీలను తెరిచి లెక్కిస్తున్న దృశ్యం

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో హుండీలను గురువారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీలను తెరవగా జూలై 29 నుంచి ఇప్పటివరకూ రూ22,05,551లు ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## 23న శృంగారవల్లభస్వామి హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, డిసెంబరు 19: మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయాన్ని ఈనెల 23న లెక్కించనున్నట్లు దేవస్థానం ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఈలెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

## ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో జరుగుతున్న దత్త జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర, అల్లూరి సీతారామరాజు నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళ్లకు కట్టినట్లు ఇతివృత్తాన్ని ప్రదర్శించారు. హరిశ్చంద్రుడిగా కర్రెడ్ల బాబ్జి, దొడ్డిపట్ల సత్యనారాయణ, చంద్రమతిగా నంది అవార్డు గ్రహీత విజయనగరానికి చెందిన కేవీ పద్మావతి, విశ్వామిత్రుడిగా జిల్లా భజనమండలి సంఘాల కన్వీనర్ ధర్మారం వీరవెంకట విజయదుర్గ, సాన నూకరాజునాయుడు తదితరులు నటించారు. అల్లూరి సీతారామరాజు నాటకంలో ప్రదర్శించిన ఘట్టాలు అందరినీ ఉత్తేజ పరిచాయి. కళాకారులను ధర్మవరం విజయదుర్గ నాట్యమండలి అధ్యక్షుడు నూకరాజు, దొడ్డిపట్ల సత్యనారాయణలు సత్కరించారు.

## చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన కౌలు రైతు చికిత్స పొందుతూ మరణించాడు. గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన రౌతు నరసయ్య(33) కుటుంబంలో కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. అదే సమయంలో మద్యానికి బానిసైన అతను బుధవారం పొలంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతనిని తొలుత ప్రత్తిపాడు అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. ఇతనికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# 59 ఉప కులాలకు దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలి



కలెక్టరేట్‌వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ఎస్ నేతలు సంజయ్ మాదిగ, సుధాకర్

కాకినాడ సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను 59 చీఉప కులాలకు దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింగ సుధాకర్ కోరారు. గురువారం కాకినాడ కలెక్టరట్‌లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అభిప్రాయాల ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌వద్ద తమ డిమాండ్లతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ఎస్ నేతలు సంజయ్ మాదిగ, సుధాకర్ మాట్లాడుతూ సమాజంలో ఎస్సీలకు, అగ్రవర్ణాలకు మధ్య గల అసమానతలను తొలగించడానికి ఆనాడు అంబేడ్కర్ దళితులకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కాలక్రమేణా 15 శాతం ఉన్న రిజర్వేషన్ల ఫలాలను మాల వర్గం వారే అనుభవించడంవల్ల మాదిగ ఉప కులాలవారు విద్య, వైద్య, రాజకీయపరంగా వెనుకపడిపోయారన్నారు. ఎస్సీల్లోని 59ఉప కులాల కు వర్గీకరణ ఫలాలు అందాలంటే ఏడీసీడీలుగా జనాభా నిష్పత్తిని బట్టి వర్గీకరణ చేయాలన్నారు. ఇందుకు ఎమ్మార్పీఎస్ గడచిన 30 ఏళ్లుగా పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దోకుబుర్ర పద్మనాభం

## మూడు జిల్లాల్లో ఎస్సీలకు ఒక్కో అసెంబ్లీ స్థానం కేటాయించాలి

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు భద్రం మాస్టారు వినతి

కాకినాడసిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలలో ఇంకా వెనుకబడిన ఉప కులాల అభివృద్ధి కోసం కొన్ని సంస్కరణలు చేయాలని, ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను విభజించినందున కాకినాడ, కోనసీమ, రాజమహేంద్రవరం మూడు జిల్లాలో ఎస్సీలకు ఒక్కో అసెంబ్లీ స్థానం కేటాయించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డోకుబుర్ర భద్రం మాస్టారు గురు వారం వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భద్రం మాస్టారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలో ఒకే ప్రాంతానికి ఒక పార్లమెంట్, మూడు అసెంబ్లీ స్థానాలు కేంద్రీకృతమవడం వల్ల ఆప్రాంత ఎస్సీలకే రాజకీయ ప్రాతినిధ్యం కలుగుతోందన్నారు. మూడు జిల్లాలకు మూడు అసెంబ్లీ స్థానాలు కేటాయించి ఆయా ప్రాంతాల ఎస్సీలకు రాజకీయ భరోసా కల్పించాలన్నారు. ఆ విధంగా మాల, మాదిగ, రెల్లిలకు ఆయా ప్రాంతాలలో రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. అలాగే ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న కోనసీమ జిల్లాకు పార్లమెంట్ స్థానాన్ని మాలలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందికి వీరబాబు, కొముకూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# రెల్లి కులానికి ప్రాధాన్యం కల్పించాలి



కమిషన్ అధినేత రాజీవ్‌రంజన్‌మిశ్రాను కలిసిన రెల్లి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లికులానికి జనాభాకు అనుగుణంగా ప్రాధాన్యం కల్పించాలని రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకినాడ వచ్చిన ఏకసభ్య కమిషన్ ప్రతినిధి, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రాను కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎస్సీ జనాభాలో అయిదుశాతంగా ఉన్న తమకు రిజర్వేషన్లల్లో మాత్రం 0.03 దక్కుతుందని తెలిపారు. తమ వర్గానికి చెందిన దయనీయమయిన జీవితాన్ని గడుపుతున్నారని వారు చెప్పారు. వర్గీకరణలో రెల్లికులానికి ప్రాదాన్యత ఇవ్వడంతో ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏకసభ్య కమిషన్‌ను కలిసిన వారిలో రెల్లి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల సూరిబాబు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, న్యాయవాది బంగారు రామకృష్ణ, జిల్లా రెల్లి మహిళా ఐక్యవేదిక కన్వీనర్ బంగారు ద్వారక, యర్రంశెట్టి సత్యమోహన్, ధనాల నానిబాబు, బంగారు కన్నయ్య, కల్యాణ్ పాల్గొన్నారు.

# ఎస్సీ కులాల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందించిన ఎస్సీ నాయకులు

కరప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల ఉప వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఇది చెల్లదంటూ 1998లోనే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ స్పష్టమైన ఆదేశాలు జారీచేసిందని పీవీ రావు మాలమహానాడు సభ్యుడు సవిలే రాజేష్ పేర్కొన్నారు. కరపలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ, క్రిమీలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఎస్టీ ఏకసభ్య కమీషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసి 10 పాయింట్లతో కూడిన వినతి పత్రం అందజేశామన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడానికి గల కారణాలు, రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, తదితర అంశాలపై తమ అభిప్రాయాలను కమీషన్‌కు వినిపించినట్టు తెలిపారు. పలువురు ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.



కమిషన్ చైర్మన్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న రాజేష్

## కమ్యూనిటీ హాలు అభివృద్ధికి సహకరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల వివాహాది, శుభకార్యాలు, ఫంక్షన్ల కోసం సామాజిక భవనం అభివృద్ధికి సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హామీ ఇచ్చారు. గురువారం రమణయ్యపేట గైగోలుపాడు సాయినగర్‌లో శ్రీషిరిడీ సాయి ధ్యానమందిరం అధ్యక్షులు, జీజీహెచ్ సలహా సంఘం సభ్యులు మేకా లక్ష్మణరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలు, ఆలయ అభివృద్ధిపై శెట్టిబలిజ సామాజికవర్గం గ్రామపెద్దలతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో ఎమ్మెల్యే పా ల్గొన్నారు. గ్రామ పెద్దలు పాలిక శ్రీను, పాలిక నరసింహమూర్తి, గుబ్బల అప్పారావు, అల్లూరి సత్యనారాయణ చౌదరి, పాలిక రామ్మోన్‌రావు, పెంకే వెంకటేశ్వరరావు, గంజా సత్తిబాబు, కె. బాలాజీ పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎంటీ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలి

సర్పవరంజంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఎస్ఆర్ఎంటీ ఆధ్వర్యంలో రూ.40లక్షల నిధులతో నిర్మించిన రూరల్ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు కోరారు. గురువారం రమణయ్యపేటలో ఎమ్మెల్యే పంతం నానాజీకి ఈ మేరకు గ్రామస్థులతో కలిసి వినతి పత్రం అందించారు. పండూరులో పీహెచ్‌సీ ఉందని, ఇది శివారున ఉండటంతో రమణయ్యపేట పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందేలా 2016లో ఈ భవనం నిర్మిం చి, వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య సేవలు అందించేవారన్నారు. ప్రస్తుతం వైద్యసేవలు నిలిచిపోవడంతో అనారోగ్యం సంభవిస్తే జీజీహెచ్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, సర్పవరం, తిమ్మాపురం గ్రామప్రజలకు వైద్యసేవలు అందించేలా ఒక వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈవిషయమై వైద్యశాఖ మంత్రితో మాట్లాడి ఆసుపత్రిలో వైద్యసేవలు జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నానాజీ హామీ ఇచ్చారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- కేవీపీఎస్, దళిత, ప్రజా సంఘాల నిరసన



అంబేడ్కర్ చిత్రపటాలను మెడలో వేసుకుని ప్రదర్శిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భార త రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కేవీపీ ఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక ఇంద్రపాలెం వంతెనవద్ద గల అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ప్రముఖ న్యాయవాది జవహర్ ఆలీ, పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్ల మెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. "ఈ కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకుల అయితాబత్తుల రామేశ్వరరావు, డాక్టర్ భానుమతి, మోర్త రాజశేఖర్, తుమ్మల నూకరాజు, ఎస్ శ్రీనివాస్, పిల్లి రామారావు,జి బేబి రాణి, వీరబాబు, ప్రసాద్, బి.సురేష్, కె.సింహాచలం పాల్గొన్నారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఫొటోలు దహనం

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండేందుకు అనర్హుడని మాల సంఘాల రాష్ట్ర వర్కిగ్ ప్రెసిడెంట్ పండు అశోక్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఇంద్రపాలెం వంతెనవద్ద అమిత్ షా ఫొటోలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్సీ కాకినాడజిల్లా అధ్యక్షుడు సుబ్బుబాయ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. బాబా సాహబ్ అంబేడ్కర్ తమ దేవుడంటూ ఆయన చిత్రపటాలను మెడలో వేసుకుని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కండపల్లి లోవరాజు, జేఏసీ జిల్లా అధ్యక్షుడు లింగం శివకుమార్, బీఎస్పీ జగ్గంపేట ఇన్‌చార్జి జుట్టుకు నాగేశ్వరరావు, పీవీ రావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మూలె మొగరాజు, దళిత ప్రజాశక్తి అధ్యక్షుడు మురారి రవి, జేఏసీ సభ్యులు, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఫొటోలను దహనం చేస్తున్న నాయకులు

## నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం అందజేత

సామర్లకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవదాయశాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సామర్లకోటకు చెందిన గున్నపు సత్యవతి మనుమడు గున్నపు ప్రదీప్‌కుమార్ పేరిట రూ.లక్ష విరాళాన్ని గురువారం ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠంకు దాత సత్యవతి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో దాతకు స్వామివారి, అమ్మవారి ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేశారు. ఈ మేరకు నగదు డీడీని ఈవో నీలకంఠంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పండితులు చెరుకూరి రాంబాబు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

## కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక దుమ్ములపేట యేసు క్రీస్తు ప్రార్థన మందిరంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమా వేశంలో ముఖ్యఅతిథులుగా పాస్టర్లు మోసా అబ్రహం, వి పాల్, జీ దైవ వరప్రసాద్, మోస జాన్, చోడిపిల్లి దానియేలు పా ల్గొన్నారు. అనంతరం ముఖ్య సలహాదారులు, సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షు డిగా కాశరపు సింహాద్రి, ఉపాధ్యక్షుడిగా లూక, కార్యదర్శిగా మోసా ప్రసన్నకుమార్, సంయుక్త కార్యదర్శిగా విఅబ్రహం, కోశాధికారిగా డియోహాను, సంయుక్త కోశాధికారిగా ఏప్రసాద్‌ల ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాస్టర్లు మూగు సత్యం, కె దావీదు, మోసా ఇస్సాకు, మోసా కృపానందం, చీకటి డానియేలు, పేర్ల పౌలు తదితరులు పాల్గొన్నారు.

## సైరన్‌తో జనసేన నేత హల్‌చల్

వాహనాన్ని ఆపిన పిఠాపురం ఎస్ఐ

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైరన్ వేస్తూ జనసేన నేత తన వాహనంతో పిఠాపురంలో హల్‌చల్ సృష్టించారు. జనసేన నాయకుడు శ్రీను తన వాహనంలో ప్రభుత్వ అధికారులు, పోలీసు వాహనాలకు వినియోగించే సైరన్ వేస్తూ తిరుగుతుండటంతో పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్ వాహనాన్ని ఆపివేశారు. సైరన్ ఉపయోగించకూడదని ఎస్ఐ సూచించారు. ఈలోగా కాకినాడ జిల్లాకు చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి నుంచి ఫోన్ రావడంతో పోలీసులు వాహనాన్ని వదిలివేశారు.

## భవిత కేంద్రానికి భోజన ప్లేట్లు అందజేత

పెద్దాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రానికి దాతల సహకారంతో రూ. ఐదు వేల విలువచేసే భోజన ప్లేట్లను మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ఆధ్వర్యంలో గురువారం అందజేసినట్లు సంస్థ నిర్వాహకుడు దేవత రాజేష్‌కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో దాతలు తమ్మన సత్యనారా యణ, పార్వతీదేవి, సాయికిరణ్, మౌనిక, సహిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి, హెచ్ఎం శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# 'భూసమస్యల పరిష్కారమే ధ్యేయం'

సామర్లకోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా గ్రామాలలో ఉన్న భూ వివాదాలను సత్వరం పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట మండల తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొ న్నారు. సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రెవెన్యూ సదస్సు డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పుల నమోదులు, వాస్తవంగా నమోదు కన్నా తక్కువ విస్తీర్ణం నమోదులు, భూసర్వే తదితర సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయన్నారు. అనంతరం గ్రామంలో పలు భూసమస్యల మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ సర్వేలకు చెంది 5 అర్జీలను స్వీకరించారు. ఈ సదస్సులలో కార్యాలయ సూపరింటెండెంట్ కె.పద్మజ, సర్పంచ్ చీమల భవాని, టీడీపీ నాయకులు తలాటం బాబులు, దమ్మాల మహేశ్వరరావు, దమ్మాల బాబ్జీ, దేగల సత్యనారాయణ, వీఆర్వోలు, సర్వేయర్లు, డీఈవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారంపై చర్యలు చేపట్టాలి

తాళ్లరేవు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను రెవెన్యూ అధికార్లు పరిష్కారదిశగా ముందుకు అడుగులు వేయాలని టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అన్నారు. గురువారం పి.మల్లవరం పంచాయతీలో సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సును తహసీల్దార్ పి.త్రినాదరావు నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నేత ధూళిపూడి మాట్లాడుతూ రెవెన్యూశాఖలో రైతు సమస్యలను అధికార్లు ప్రక్షాలన చేపట్టాలన్నారు. ఈ సదస్సులో 30మంది రైతులు అర్జీలను రెవెన్యూ అధికార్లకు అందించారు. టీడీ ఎం.సూరిబాబు, రీసర్వే డీటీ హరి, వీఆర్వోలు అప్పనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 'సాగునీటి ఇబ్బందులను పరిష్కరిస్తాం'

కరప, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులను సత్వరం పరిష్కరిస్తామని కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ నూతన చైర్మన్ పీజీ సత్యనారాయణ స్పష్టంచేశారు. సంపరబోది పంటకాలువలో గుర్రపుడెక్క పెరిగిపోయి సాగునీటి ప్రవాహానికి అవరోధంగా నిలిచిందని పలువురు రైతులు డీసీ చైర్మన్ పీజీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ గుర్రపుడెక్క వల్ల వాకాడ, వేములవాడ, వలసపాకల, కరప గ్రామాల పరిధిలోని పంటపొలాలకు సాగునీరు సక్రమంగా అందడంలేదని వారు వివరించారు. స్పందించిన పీజీ అప్పటికప్పుడు ప్రొక్లెయినర్ మిషన్ పురమాయించి గుర్రపుడెక్క తొలగించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టిలో పెట్టి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జనసేన నాయకుడు మీసాల రాంబాబు, టీడీపీ నాయకులు వాసంశెట్టి రామాంజనేయులు, చాట్ల ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబరు 31 నాటికి చెల్లించాలి

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 2024-25 రెండో అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను వడ్డీ లేకుండా చెల్లించేందుకు ఈఏడాది డిసెంబరు 31వరకు మాత్రమే అవకాశం ఉందని 2025 జనవరి 1వతేదీ నుంచి ఆస్తి పన్ను బకాయిపై 2శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయి ఉన్న ఇళ్లు, వాణిజ్య భవనాల చరాస్తుల జప్తుకు నగరపాలక సంస్థ చట్టం 1955 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

### తోటకూర సత్తెమ్మ అమ్మవారి జాతర

జగ్గంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామంలో ఉన్న శెట్టిబలిజపేటలో ఉన్న తోటకూర సత్తెమ్మ అమ్మవారి 31వ జాతర మహోత్సవాలను గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో సాయంత్రం గరగ నృత్యాలతో ఊరేగించారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## అల్లూరి జిల్లాలో ప్రత్యేక పర్యాటక మండలి

### గిరిజనుల భాగస్వామ్యంతో ఏర్పాటుకు సీఎం ఆమోదం

### 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించిన కలెక్టర్ దినేష్‌కుమార్



రంపచోడవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి ప్రత్యేక పర్యాటక మండలి ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదం తెలిపారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మన్యంలో పర్యాటకరంగాభివృద్ధికి గల అవకాశాలపై జరిగిన చర్చలో కలెక్టర్ దినేష్ మాట్లాడారు. మైదాన ప్రాంతాల మాదిరిగా ఇక్కడ పర్యాటక రంగాన్ని కార్పొరేట్ సంస్థల ద్వారా అభివృద్ధి చేయలేమని, గిరిజన ప్రాంత చట్టాలు ఇందుకు అనుమతించవన్నారు. పూర్తిగా గిరిజనుల భాగస్వామ్యంతో జిల్లాలో ప్రత్యేక పర్యాటక మండలి ఏర్పాటు చేయడం ద్వారా కొన్ని పరిమితుల మేరకు పర్యాటకాన్ని అభివృద్ధి చేయచ్చని తెలపగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో జిల్లా పర్యాటక మండలి ఏర్పాటుకు కలెక్టర్ దినేష్ కసరత్తు చేస్తున్నారు. రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏల పరిధిలోని గిరిజనుల నుంచి కొందరిని సభ్యులుగా, కలెక్టర్ చైర్మన్‌గా ఉండేలా మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చనుంది.




సమావేశంలో మాట్లాడుతున్న సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు

## ఘనంగా క్రైస్తవ ఉద్యోగుల ఐక్య క్రిస్మస్

మోతుగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ జెన్‌కో కళాభారతి ఆడిటోరియంలో క్రైస్తవ ఉద్యోగుల ఐక్య క్రిస్మస్ వేడుకలు గురువారం జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ప్లాంట్ మేనేజరు భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, డీఏవీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమన్నారు. సంఘకాపరులు, సభ్యులు చిన్నారులు ఆలపించిన గీతాలు, నాటకాలు, నృత్యాలు అలరించాయి. క్రైస్తవ మత బోధకుడు పి.చంటిబాబు మాట్లాడుతూ మంచి ఆలోచనతో దైవమార్గంలో నడవడం అభినందనీయమన్నారు. వచ్చిన వారందరికీ వేమగిరి కిరణ్, కల్పన, విజయకిరణ్, దారబాబు, ప్రసాద్, ప్రేమ్ విందు ఏర్పాటు చేశారు.



పీహెచ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర బృందం

## పీహెచ్‌సీల్లో వైద్య సేవల పరిశీలన

ఎటపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పీహెచ్‌సీల్లో అందుతున్న వైద్య సేవలను వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర బృందం గురువారం పరిశీలించింది. డాక్టర్ రమేష్, ట్రైబల్ ప్రోగ్రాం ఆఫీసర్, కన్సల్టెంట్ రాజ్‌కిరణ్ నెల్లిపాక పీహెచ్‌సీలో వసతి సౌకర్యాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పక్కనే ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులపై నిర్వహిస్తున్న సర్వే నమోదుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీల్లోని సమస్యలు, కలుగుతున్న ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు.

**రంపచోడవరం 19 (ఆంధ్రజ్యోతి):** ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించే బాధ్యత వైద్యాధికారులపై ఉందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం ఆయన సీతపల్లి, పెదగెద్దాడ పీహెచ్‌సీలను సందర్శించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## ఎమ్మెల్యే శిరీషదేవి ప్రజాదర్బారు




ఎమ్మెల్యే శిరీషదేవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వై.రామవరం తహసీల్దారు వేణుగోపాల్

వై.రామవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బారుకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ హాజరయ్యారు. మంచినీటి ట్యాంకు నిర్మాణం కోరుతూ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఆశ్రమ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఆయా సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. తహసీల్దార్ వేణుగోపాల్ ఎమ్మెల్యేను తొలిసారిగా కలిసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. పలు శాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే అడ్డతీగల మండలం దాకోడు గ్రామంలో చర్చిని ప్రారంభించారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మోతుగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద జెన్‌కో ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్, చండీగఢ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పీసా గ్రామ సభలు

రాజవొమ్మంగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీసా గ్రామసభలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. వైస్ ప్రెసిడెంట్, కార్యదర్శులను ప్రజలు ఎన్నుకున్నారు. తహసీల్దారు సత్యనారాయణ ఆధ్వర్యంలో అమీనాబద్, వనకరాయి గ్రామాల్లో సభలు నిర్వహించారు. చికిలింత, కొండలింగంపర్తి, పెద్దగర్రంగి, అనంతగిరి, దామనపాలెం, మొల్లిమెట్ల, లాగరాయి, అప్పలరాజుపేట, అప్పనపాలెం, శరభవరం, బలిజపాడు, కొత్తపల్లి గ్రామాల్లోనూ సభలు జరిగాయి.

**దేవీపట్నం (ఆంధ్రజ్యోతి):** ఇందుకూరు-1 ఆర్ అండ్‌ఆర్ కాలనీలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి అధ్యక్షతన డిప్యూటీ తహసీల్దారు జనార్దన్ ఆధ్వర్యంలో పీసా గ్రామ సభ నిర్వహించారు. వైస్ చైర్మన్‌గా మడకం పెంటన్నదొర, కార్యదర్శిగా నాగిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**రంపచోడవరం (ఆంధ్రజ్యోతి):** ఏజెన్సీ పరిధిలోని 120 పంచాయతీల్లో ఈ నెల 24వ తేదీ వరకు పీసా గ్రామసభల నిర్వహణకు అధికారులను నియమించినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గురువారం ఆయన తన చాంబరులో విలేకరులతో మాట్లాడుతూ 180 గ్రామ సభల ద్వారా ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకుంటారని చెప్పారు.



తొండంగి : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యనమల దివ్య



ప్రత్తిపాడు: శరభవరంలో సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

## టీడీపీ రైతుల మేలుకోరే ప్రభుత్వం

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం రైతుల మేలు కోరే ప్రభుత్వమని, వారి సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం ఏ కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనేక భూసమస్యలు పరిష్కరించే నాధుడులేక రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజల ముంగిటకు అధికార్లను పంపి సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహశీలార్ మురార్జీని గ్రామంలో రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, మాజీ ఎంపీపీ యనమల కృష్ణ, కొయ్యా శ్రీనుబాబు, టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షులు కొయ్యా రామకేశవ, పార్టీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, మత్స్యకార నాయకుడు కోడ వెంకట రమణ, బెండపూడి మాజీ సర్పంచ్ సాధనాల నూకరాజు, అరిగెల నర్సింహమూర్తి, ఆర్ఐ రాజారావు, ఎంపీడీవో రాజేశ్వరరావు స్థానిక నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



గండేపల్లి సదస్సుల్లో మాట్లాడుతున్న ఆర్డీవో రమణి

### భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

**గండేపల్లి:** భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు అని పెద్దాపురం ఆర్డీవో కె.రమణి అన్నారు. ఆమె మండలంలో బొర్రంపాలెం గ్రామంలో గురువారం తహసీల్దార్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ముఖ్యఅతిథులుగా ఆర్డీవో రమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు, సర్వే నెంబర్ల అవకతవకలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు గ్రామగ్రామాన నిర్వహిస్తుందన్నారు. ఎవరికి ఎటువంటి భూ సమస్యలు ఉన్నా సదస్సుల్లో అర్జీలు పెట్టుకుంటే తక్షణం పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సదస్సుకు 10అర్జీలు వచ్చాయని సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు.సమావేశంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబి, వీఆర్వో లాజర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు:** భూసమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని శరభవరం గ్రామంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో డిప్యూటీ కలెక్టర్ పాల్గొని గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. రైతుల నుంచి 6 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. సర్పంచ్ అమరాది వెంకట్రావు, ఎంఆర్ఐ గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

ప్రత్తిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలకు ప్రత్తిపాడులో పలువురు నిరసనలు వ్యక్తం చేశారు. హోం మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి వ్యాఖ్యలు తీవ్ర బాధ్యతా రాహిత్యం అని ఐలాజ్ ప్రతినిధులు తెలిపారు. కాకినాడజిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు అమిత్‌షా వ్యాఖ్యలు దారుణమన్నారు.

### 'అమిత్‌షా రాజీనామా చేయాలి'

**జగ్గంపేట:** మనువాద మతోన్మాద కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని పార్లమెంటులో ఎగతాళిచేసి అహంకారంగా మాట్లాడటం దారుణమైన చర్య అని బహుజన సమాజ్‌పార్టీ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు అన్నారు. ఈ మతోన్మాద చర్యను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రజలు, ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలన్నారు.

### ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తాం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య

తునిరూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యువ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, మోత్కూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, మళ్ళ గణేష్, అల్లు రాజు,దంతులూరి శ్రీనివాస్ రాజు, కోడా రమణ, దూరం మురళీ, అన్వేష్ అభివృద్ధి కమిటీ సభ్యులు గంటల చిన్నారావు, రాజా, పూడి సత్యవేణి, విజయ్, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కార్మికుల నిరసన




జీడిపిక్కల పరిశ్రమ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలేశ్వరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల పరిశ్రమను అర్ధంతరంగా మూసివేయడంతో కార్మికులు ఉపాధి కోల్పోయి నిరసనలు కొనసాగిస్తున్నారు. గురువారం పరిశ్రమ గేటు వద్ద 409 మంది కార్మికులు మాట్లాడుతూ యాజమాన్యం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. పరిశ్రమ మూతపడటంతో ఉపాధి లేక కుటుంబ పోషణ కరువైందన్నారు. ఇప్పటికైనా అధికారులు, యాజమాన్యం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.

## తులాగిరి శ్రీరామ ఆలయ నిర్మాణానికి విరాళాలు



రామాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

ప్రత్తిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తులాగిరి కొండపై నిర్మాణంలో ఉన్న శ్రీరామ ఆలయక్షేత్రానికి గురువారం పలువురు దాతలు విరాళాన్ని అందించారు. ప్రత్తిపాడుకు చెందిన దివంగత రెడ్నం మూర్తి జ్ఞాపకార్థంగా ఆయన సతీమణి పుష్పలత రూ.1,00116 విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. అలాగే ప్రముఖ వ్యాపారి పచ్చారి సూర్యప్రసాద్ రూ.10వేలను రామాలయక్షేత్ర అభివృద్ధికి విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీకి చెందిన తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ, అనంతపల్లి శ్రీనివాస్, రెడ్నం రాజా, రెడ్నం కోటి, దాట్ల పుష్ప రెడ్డి, పత్రి రమణ, గోగుల బుజ్జి, మదినే నూకరాజు తదితరులు దాతలను శాలువాతో సత్కరించారు.

### ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జగ్గంపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రప్పాలెంలో కరుణామయుడు స్టీల్స్ అధినేత ఉలిశెట్టి తాతాజీ ఇంటి వద్ద క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. పాస్టర్ యాకూబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్‌చేసి తుమ్మలపల్లి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, గంగాధర్, వీరబాబు పాల్గొన్నారు.

## ఆరు జంటలకు పెళ్లి కానుక అందజేత



పెళ్ళికానుక చెక్‌లను అందజేస్తున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రావులమ్మఆలయంవద్ద టీడీపీ కార్యాలయంలో ఆరు జంటలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.1.20లక్షలు పెళ్లి కానుకను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అందజేశారు. పేదింటి ఆడబిడ్డలకు పెళ్లి కానుక రూ.20 వేలు పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు ఆసరాగా అందిస్తామన్నారు. మండలంలోని జె.కొత్తూరుకు చెందిన బి. చిన్నారి, మన్యంవారిపాలేనికి చెందిన జి.దుర్గా భవాని, కిర్లంపూడి మండలం వీరవరానికి చెందిన ఎం.సంధ్యాదేవి, గోనేడకు చెందిన ఎస్. అరుణ్, సింగరంపాలేనికి చెందిన కె. రోజారాణి, కొత్తపల్లికి చెందిన కె.మాధవిలకు నెహ్రూ ఫౌండేషన్ ద్వారా జ్యోతుల నవీన్ నూతన దంపతులకు రూ.20వేలు చెక్కులను అందించారు. పేద ఇంటి ఆడబిడ్డ పెళ్ళికి 9 రోజులు ముందు ఫౌండేషన్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకుని తెలియజేస్తే సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టిభద్రం, కందుల చిట్టిబాబు, కొత్త కొండబాబు, నీలం శ్రీను, అడబాల భాస్కరరావు, బుర్రి సత్తిబాబు, పాఠంశెట్టి మురళీకృష్ణ, నకిరెడ్డి సూర్యావతి, పోట్రూ కృష్ణ, పోట్రు రాముడు, బొడ్డు బుజ్జి, మురా సత్తిబాబు, గద్దె మారుతి తదితరులు పాల్గొన్నారు.

### మోతుగూడెంలో

## రక్తదాన శిబిరం

మోతుగూడెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐఎన్టీయూసీ 327 యూనియన్ కార్యాలయంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, బ్లడ్ బ్యాంక్, చింతూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పొల్లూరు, ఇంతలూరువాగు, ఎంసీడీ క్యాంపు యువకులు, జెన్‌కో ఉద్యోగులు... మొత్తం 62 మంది రక్తదానం చేశారు. శిబిరంలో సర్పంచ్ ఆకేటి సీత పాల్గొన్నారు.





## మడిపల్లిలో వాహనాల తనిఖీ

దేవీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో ఎస్ఐ షరీఫ్ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు పూర్తిస్థాయిలో లేకపోతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, మితిమీరిన వేగంతో వెళ్లినా చర్యలు తీసుకుంటామన్నారు.

### 'సమాచారం లేకుండా పీసా గ్రామసభల నిర్వహణ రాజ్యాంగ విరుద్ధం'

దేవీపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముందస్తు సమాచారం ఇవ్వకుండా పీసా గ్రామసభ, ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. ప్రచారం చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ రాంబాబుకు డాక్టరేట్



గండేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ దారా రాంబాబుకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం), కర్నూల్ నుంచి డాక్టరేట్ సాధించిన తొలి వ్యక్తి దారా రాంబాబు అని ఆదిత్య విద్యాసంస్థల వైస్‌చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ డాక్టర్ ముమ్మల పుల్లారావు నేతృత్వంలో దారా రాంబాబు సమర్పించిన సోలార్ థర్మల్ ఎనర్జీ అంశంపై డాక్టరేట్ పొందారని ఆయన తెలిపారు. దారా రాంబాబు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి ఆకాంక్షించారు. రాంబాబును పలువురు అభినందించారు.

### పంట బీమాపై రైతులకు అవగాహన



కరప్రతాలు ఆవిష్కరిస్తున్న ఏవో జ్యోతి, రైతులు

ఏలేశ్వరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):ప్రతీ రైతు పంటకు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారిణి బి.జ్యోతి తెలిపారు. గురువారం మండలంలోని సి.రాయవరం, రమణయ్యపేట గ్రామాల్లో రైతులకు పంటల బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో జ్యోతి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ యోజన పథకం ద్వారా పంటకు బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పొలంపై లోన్ తీసుకొని రైతు ఎకరానికి రూ.630, మినుములు, పెసలు ఎకరాకు రూ.300చొప్పున అందుబాటులో ఉన్న మీసేవా కేంద్రాలలో ఈనెల 31వ తేదీలోపు చెల్లించుకొని బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌లు గుమ్ములూరి జగదీశ్వరి, సునీత, రఘురామకృష్ణ, చల్ల రాజారావు, రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### జేఎన్టీయూకే యోగా టీంకు ఆదిత్య విద్యార్థి ఎంపిక



యోగా మెయిన్ టీంకు ఎంపికైన గణేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

గండేపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఏఐఎంఎల్ విభాగానికి చెందిన విద్యార్థి జేఎన్టీయూకే యోగా మెయిన్ టీంకు ఎంపికైనట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈనెల 24నుంచి 28 వరకు కేఐఐఎస్ఎస్ యూనివర్శిటీ భువనేశ్వర్ ఒరిస్సాలో నిర్వహించు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జేఎన్టీయూకే యోగా మెయిన్ టీంకు ఆదిత్య విద్యార్థి ఎంపికవడం ఆనందకరమన్నారు. ఎంపికైన విద్యార్థి గణేష్‌ను ఆదిత్య యూనివర్శిటీ వైస్‌చైర్మన్ అభినందనలు తెలుపుతూ రూ.5వేలు నగదు అందించి టోర్నమెంట్‌లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

### 1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తుని రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి):తుని ఎక్సైజ్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో తొండంగి మండలం గడ్డిపేట గ్రామంలో తుని ఎక్సైజ్ పోలీసులకు పెద్దఎత్తున బెల్లపు ఊట పట్టుబడింది. పక్కా సమాచారంతో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు 1600లీటర్ల పైబడి బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు ఎస్‌హెచ్‌వో వై. పట్టాభి చౌదరి తెలిపారు.

### వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

జగ్గంపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ జగ్గంపేటకు చెందిన మాలలు కాకినాడలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఎస్సీ కులాల్లో గణాంకాలు తేల్చకుండా వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. వర్గీకరణ రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించినది కాదని చెప్పారు. ఈ వర్గీకరణను ఉప కులాల గణాంకాలు తేల్చేవరకు నిలుపుదల చేయాలన్నారు.